"అకస్మాత్తుగా దేవుడు ప్రత్యక్షమై నీకేం కావాలో కోరుకొమ్మంటే ఎవరేం కోరుకుంటారో ఇప్పుడు చెప్పాలి" అన్నాడు రాజీవ్.

ఆదివారం నాడు మిట్టమధ్యాహ్నం మొదలు పెట్టిన తాగుడు సాయంకాలం వరకూ సాగుతున్నప్పుడు, ప్రపంచంలోని సవా లక్ష సంగతుల గురించి మాట్లాడుకోవడం అయిపోయినప్పుడు.... ఇలాంటి టాపిక్ రావడంలో వింతేమి ఉంది?

'నేనైతే రోజుకో స్కాచ్ బాటిల్... నంజుకోవడానికి కాజూనట్ ఫ్రై, తర్వాత మంచి డిన్నర్, ఆ తర్వాత సూపర్ ఫిగర్" అన్నాడు రవి.

"తరతరాలు తిన్నా తరగని ఆస్తి....హాయిగా ఆడుతూ పాడుతూ సాగిపోయే జీవితం" అన్నాడు చక్రి.

# డబ్బులు కాసే చెట్లు

వెంకటేష్

"ఎన్ని సిగరెట్లు కాల్చినా, ఎంత మందు తాగినా, ఎంత మందితో తిరిగినా ఏమీ కానంత ఆరోగ్యం కోరుకుంటాను" అన్నాడు రఘు.

"మరి నీ సంగతి ఏమిట్రా?" అన్నాడు రాజీవ్ నేనేమీ మాట్లాడకపోవడంతో.

"నాకీ విషయంలో చాలా స్పష్టమైన ఆలోచన ఉంది. డబ్బు చెట్లకి కాయాలని కోరుకుంటాను నేను" అన్నాడు.

"లే...." అంటూ అరిచారు నలుగురూ నా కోరిక విని. "నీ కోరిక అదుర్స్ రా" అన్నాడు రఘు.

నా మనసులో అలాంటి కోరిక ఏర్పడడానికి తగిన నేపథ్యం ఉంది నా జీవితంలో.

చిన్నతనం నుంచి నా జీవితంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు. దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టాన్నేను. నాన్న రైతు. అమ్మ గృహిణి.

కేవలం ఆడపిల్ల పుట్టాలన్న నాన్న తాపత్రయం వల్ల మేము ఆరుగురు సంతానం తయారయ్యాము. ఆయనకు వరుసగా అయిదుగురు అబ్బాయిలు. తర్వాత గానీ ఆయన కోరిక తీరి, ఆడపిల్ల పుట్టలేదు. మాకున్నదల్లా ఎకరం పొలం. వ్యవసాయం తప్ప మా నాన్నకి మరో పని తెలీదు. ఇల్లూ పొలం తప్ప మరో లోకం లేదు ఆయనకు. ఆ కాస్త పొలం మీదా వచ్చే ఆదాయం తనకీ, భార్యకీ ఆరుగురు పిల్లలకీ సరిపోదని, అంతమంది పిల్లల్ని కనక ముందు ఆయనకు తెలుసో లేదో నాకు తెలియదు. కేవలం ఒక ఆడపిల్ల ఉండాలన్న తపన వల్ల మాత్రం ఆయన గంపెడు సంతానాన్ని కన్నాడు. నాకు ఊహ తెలిసేసరికి నేను ఏది అడిగినా కొనివ్వ(లే)ని నాన్న మాత్రమే తెలుసు నాకు. తాను తీర్చలేని బాధ్యతల బరువు తాలూకు విసుగునంతా ఆయన మా అమ్మ మీదా, మా మీదా చూపించేవాడు.

ఊళ్ళో శేషయ్య చిల్లర దుకాణం దగ్గర ఏదైనా కొనుక్కోవడానికి డబ్బులడిగినప్పుడూ, తీర్థం వచ్చినప్పుడు ఏ బుడగలో కొనుక్కుంటానని అడిగినప్పుడూ, బడిలో చేరాక పుస్తకాలకో, పెన్సిల్‌కో డబ్బులు అడిగినప్పుడూ... ఎప్పుడూ మానాన్న నోటి వెంట వచ్చే మొదటి మాట-తర్వాత చూద్దాం అనే.

రెండోసారీ, మూడోసారి అడిగితే మాత్రం 'తర్వాత చూద్దాం అన్నాను కదా... మా తాత దాచి పెట్టిన సొమ్మేమీ మూలగడం లేదు. ఇక్కడ.... డబ్బులేమైనా చెట్లకు కాస్తున్నాయా?'అని విసుక్కునేవాడు. నా బాల్యచాపల్యాలు ఏవీ తీరలేదన్న బాధ కన్నా, పుస్తకాలూ, పెన్సిళ్ళూ, షూలూ లేకుండా బడికి వెళ్ళి అంత మంది పిల్లల ఎదుట మాస్టార్ల చేత తిట్లు తినడం, బెంచీ ఎక్కి నిలబడడం, ఇవన్నీ ఎంతో బాధగా, అవమానకరంగా ఉండేవి నాకు.

మా నాన్న ఎన్నో సార్లు 'డబ్బులేం చెట్లకి కాయడం లేదు' అన్న మాట మా మెదడులో శాశ్వతంగా ముద్రించుకుపోయింది. ఆ పసి వయసులో విన్న కథల ప్రేరణతో దేవుడు ప్రత్యక్షమైనట్టూ, డబ్బు చెట్లకి కాసేలా వరం ఇచ్చినట్టూ, అవసరమైనన్ని డబ్బులు చెట్ల నుంచి కోసుకున్నట్టు ఎన్నో కలలు కనేవాడిని.

మా నాన్నయితే కచ్చితంగా మమ్మల్ని పదో తరగతి దాకా చదివించి మానిపించేసి వ్యవసాయమో, ఏదైనా కొట్లోనో పెట్టేసేవాడు. కానీ అనుకోకుండా ఆస్తిపరుడైన మా మామయ్య మా బాధ్యతలు తీసుకొన్నాడు.

ఆయన సహాయంతో కష్టపడి చదివాను. పెద్ద కంపెనీలో మంచి ఉద్యోగం సంపాదించుకున్నాను. ఈ నగరంలో ఇల్లు కొనుక్కుని స్థిరపడ్డాను. భార్యా పిల్లల్తో హాయిగా ఉన్నాను.

వారానికి ఆరు రోజులు ఉద్యోగం చేయడం, రోజూ సాయంకాలాలు భార్యా పిల్లల్తో గడపడం, ఆదివారం ఆదివారం స్నేహితులతో ఎంజాయ్ చేయడం.

నా ఆలోచనల్లో నేను ఉండగానే మా వాళ్ళు బిల్లు చెల్లించి, బయలుదేరే సన్నాహాల్లో ఉన్నారు.

నేనూ వాళ్ళతో బయటకొచ్చి, ఇంటి దారి పట్టాను. మా ఇల్లు అక్కడికి దగ్గర కావడంతో నడిచే వస్తుంటాను నేను. నడుస్తుంటే బార్‌లోని టాపిక్ గుర్తొచ్చింది. నవ్వొచ్చింది. నిజంగానే దేవుడు ప్రత్యక్షమైతే... అనుకుంటున్నాను. అంతలోనే కళ్ళు మిరుమిట్లు గొలిపేలా మెరుపు... మరుక్షణం నా ఎదురుగా ఒక కాంతి పుంజం.

"భక్తా....నీ కోరిక నెరవేరే సమయం వచ్చింది. ఏం కావాలో కోరుకో...."

నాకంతా అయోమయంగా ఉంది. ఎలా స్పందించాలో అర్థం కావడం లేదు.

"దేనికి భక్తా సంశయం? దేవుడు ప్రత్యక్షమైతే అనుకున్నావు కదా! తథాస్తు దేవతలు తథాస్తు అన్నారు. ప్రత్యక్షమై వచ్చాను. ఏం కావాలో కోరుకో నాయనా."

చిన్నప్పట్నుంచీ అన్ని సార్లు అనుకుని ఉండకపోతే ఆ క్షణం ఆ ఆశ్చర్యానందాలతో ఆ కోరిక కోరలేకపోయేవాడిని.

"డబ్బు చెట్లకి కాసేలా వరమియ్యి స్వామీ" అంటూ చేతులూ జోడించి ప్రార్థించాను.

"అదేమీ కోరిక భక్తా?"


"స్వామీ....ప్రపంచంలో మనుషులు ఎందరికో డబ్బులు అవసరం కొండంత. కానీ వాళ్ళ దగ్గర ఉండేది గోరంత. అలాంటి వాళ్ళల్లో నేనూ ఒకణ్ణి. అందుకే ఆ డబ్బు అవసరం తీరిపోయేలా డబ్బు చెట్లకి కాసేలా వరం ఇమ్మని కోరుకుంటున్నాను."

"సరే ఇంతకీ ఏ చెట్లకి కాసేలా చెయ్యమంటావు?"

"చింత చెట్లకి స్వామీ. వాటికయితే ఆకులు ఎక్కువగా ఉంటాయి కదా స్వామీ. ఆ ఆకుల స్థానంలో డబ్బులు కాసేలా చెయ్యి స్వామీ."

"తథాస్తు ఈ క్షణం నుంచీ చింత చెట్లకి ఆకులు బదులు డబ్బులు కాస్తాయి."

ఆ మాట అన్న మరుక్షణం ఆ వెలుగు మాయమైపోయింది. ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఆనందాన్ని అదిమి పెట్టుకుంటూ, అడుగు ముందుకు వేస్తుండగా... అప్పుడు... అప్పుడు వచ్చింది నాకు....



డబ్బులు చెట్లకి కాస్తాయి సరే...కానీ చెట్లెక్కడ? ఆ ఆలోచన రాగానే నిలువెల్లా వణుకు పుట్టింది నాలో... ఈ నగరానికి వచ్చి ఇన్నేళ్ళయింది. నేను చూసిన చెట్లు వేళ్ళ మీద లెక్క పెట్టొచ్చు. చెట్లను కాల్చి కట్టిన భవంతులు తప్ప చెట్లెక్కడా కనిపించవు. ఎక్కడో ఇంత పెద్ద నగరంలో బెత్తెడు జాగాలో పార్కులు తప్ప...అక్కడ కూడా చింతచెట్లు ఉండవు కదా. అప్పుడు మొదలైంది నా వెతుకులాట చింతచెట్లని వెతుక్కుంటూ..

విశాలమైన రోడ్లు....రోడ్ల మీద రకరకాల వాహనాలు... రోడ్లకి అటూ ఇటూ దుకాణాలు... పెద్ద పెద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లు... మల్టీప్లెక్స్‌లు..బార్లు...రెస్టారెంట్లు...పబ్బులు... వెతుక్కుంటూ వెతుక్కుంటూ నగరం దాటి వచ్చేశాను. నగరం శివార్లలో పల్లెలుండాలి. ఆ పల్లెల్లో చింతచెట్లు ఉండక పోవు...వెతుక్కుంటూ బయలుదేరాను.

మహా విశాలమైన జాతీయ రహదారులు... రింగురోడ్లు... ఎయిర్‌పోర్టులు..అవన్నీ దాటుకుని వెళ్ళి చూస్తే-

చూడగానే హతశుణ్ణైపోయాను. పల్లెల్లేవు పొలాల్లేవు. తోటల్లేవు. అందంతా మహా స్మశానంలా ఉంది. నగరాల దాహపు సెగ పల్లెల్ని తాకింది. సెజ్ భూతాలు పల్లెల్ని మింగేశాయి. కాళ్ళు దడదడా వణికిపోతుండగా పరుగు ప్రారంభించాను. ఎంత దూరం సాగిందో ఆ పరుగు.... చివరికెక్కడో అస్తమిస్తున్న సూర్యుడి ఆఖరి కిరణాల వెలుగులో కనిపించిందా చింత చెట్టు. ఆ చెట్టు కింద కూర్చుని తాపీగా చుట్ట కాల్చుకుంటున్న ముసలోడు. ఒక్క ఉదుటున అక్కడికి చేరాను. ఆశగా, ఆత్రంగా చెట్టు వైపు చూశాను. చెట్టు కొమ్మలకి డబ్బుల్లేవు. ఆకులే ఉన్నాయి. పిచ్చెక్కినట్టు అయిపోయింది నాకు.

''తాతా ఈ చెట్టుకి డబ్బులు కాయలేదా?'' అన్నాను.

చుట్ట ఆఖరి దమ్ము తాగి పడేసి ''ఓ...కాశాయే'' అన్నాడు తాత. ''కాశాయా? మరి ఏవి? నువ్వు కోసేసుకున్నావా?'' నాలో ఒకటే కంగారు.

''ఇప్పుడేంటి! మొన్నప్పుడో కోసుకున్నాం... మార్కెట్‌కి తీసుకెళ్ళి అమ్ముకున్నాం.''

''అమ్ముకున్నావా? డబ్బులు అమ్ముకోవడం ఏమిటి? ఏం మాట్లాడుతున్నావ్ నువ్వు?''

''నేను బాగానే మాట్లాడుతున్నాను బాబూ...నువ్వు ఏదోలా మాట్లాడుతున్నావ్. డబ్బులమ్ముకోవడం ఏమిటి? మేం అమ్ముకున్నది చింతకాయలు, చింత పండూను.''

''చింతకాయలేంటి? చింతపండేమిటి? ఈ చెట్టుకి డబ్బులుకాయలేదా?'' అరిచాన్నేను సహనం కోల్పోయి.

''ఎక్కడైనా చెట్లకి డబ్బులు కాస్తాయా? నీ పిచ్చిగాని...చెట్లకి కాయలు కాస్తాయి. అవి అమ్ముకుంటే డబ్బులొస్తాయి. అయినా ఈ చెట్టుకి కాయలు కాస్తే నీకెందుకు? డబ్బులు కాస్తే నీకెందుకు? ఈచెట్టు నీదా? నువ్వు పాతావా? నీళ్ళుపోసి, సాకి పెంచి పెద్ద చేశావా? అసలు నీ జీవితంలో ఒక్క మొక్కన్నా పాతి ఎరుగుదువా? ఎంత డబ్బు సంపాదించావు? ఎంత ఖర్చు పెట్టావు? ఎన్ని జల్సాలు చేశావు? ఎంత వృథా ఖర్చు చేశావు? ఏనాడైనా ఒక్క మొక్క పాతావా? ఆ మొక్కకి నీళ్ళు పోశావా? డబ్బు చెట్లక్కాయలని నీ కోరిక. కానీ ఏ చెట్టుకి? ఎవరి చెట్టుకి? నీకంటూ, నీదంటూ ఒక్క చెట్టు ఉందా?'' ఉక్కిరిబిక్కిరి చేసే ప్రశ్నలు వేస్తుంటే అతడి వైపు అయోమయంగా చూశాను. ఆశ్చర్యం...అక్కడ ముసలాడు లేడు. దేవుడున్నాడు.

కళ్ళు నులుముకుంటూ మళ్ళీ చూశాను. ముసలి తాతే కనిపించాడు. వీడెవడో మాయగాడిలా ఉన్నాడు. చెట్లక్కాసిన డబ్బంతా కోసేసుకుని నాటకాలాడుతున్నాడు..

''నా డబ్బెక్కడ? మర్యాదగా చెప్పు చెప్తావా? చెప్పవా?'' నేను అరుస్తూనే ఉన్నాను.

''ఏవండీ...ఏవండీ'' అంటూ నన్ను కుదుపుతోన్న నా భార్య వైపు కళ్ళు తెరిచి అయోమయంగా చూస్తున్నాను.

''అబ్బబ్బ....తాగొద్దంటే వినరు...పట్టపగలే తాగి పడుకోవడం... పిచ్చి పిచ్చిగా కలవరించడం....పిచ్చి చూపులు చూడడం... చంపుతున్నారు బాబూ మీ వెధవ తాగుడుతో'' అంటోంది నా భార్య.

★

***సెల్ : 99519 77243***